

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 09 | శుక్రవారం 10, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari



## వ్యతిరేక వార్తలు వస్తే
# దాడులు చేయడం సరికాదు



**- శాంతియుత నిరసనలతో ఖండించాలి**
**- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

చిత్తూరు, ఏప్రిల్ 9 : పత్రికల్లో, మీడియాల్లో ఏవైనా అసత్య ప్రసారాలు వస్తే వాటిపైన శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. అలాగే వాటికి ఖండనలు ఇచ్చి తమ నిరసనలు తెలప వచ్చన్నారు. అలా కాకుండా మీడియాపై భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడటం ఏ రాజకీయ పార్టీలకైనా తగదని అన్నారు. పత్రికా స్వేచ్ఛపై భౌతిక దాడులకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఆ చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. గురువారం చిత్తూరులోని ఎస్వీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళ కళాశాల స్నాతకోత్సవానికి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ చంగల్రాయ

2 లో

## ప్రజలకు సుపరిపాలన
# అందిస్తున్నాం



- 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం
- జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి
- విభజన కన్నా జగన్ వల్లనే ఏపి నష్టపోయింది
- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు
- బాపట్ల జిల్లా సూరేపల్లిలో పట్టా పుస్తకాలు అందచేత

బాపట్ల, ఏప్రిల్ 9 : ప్రజలకు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని..దానిని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఎన్నికల్లో చెప్పనివి

6 లో

# మావిగన్ పేరుతో మరో నాటకం

**- ఇది చెబితేనే జనం నవ్వుకుంటున్నారు**
**- జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత**



ఏలూరు,ఏప్రిల్9 ఏప్రిల్ 9 :మావిగన్' పేరు ఎత్తితే జనం నవ్వుకుంటున్నారని హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై అక్కసుతో ఇలా చేస్తున్నారని, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి విరుచుకుపడ్డారు. 'గత వైపీపీ హయాంలో కనీసం ఒక ఫైర్ ఇంజన్ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. తప్పు చేసిన వారి విషయంలో చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామ న్నారు. అవగాహన లేని వాళ్ళు గతంలో ఇష్టానుసారంగా వ్యవ హరించి కోర్టుల నుంచి మొట్టి కాయలు వేయించుకున్నారని తెలిపారు. విజ్ఞత కలిగిన నాయకులు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అలాంటి తప్పులు చేయదలుచుకోలేదని హోం మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏదైనా చట్ట ప్రకారం చేయడమే తప్ప ఎక్కడా ఉదాసీనతగా వ్యవహరించదని

2 లో

## వైఎస్ గురించి
# ఎందుకు మాట్లాడుతారు

**- అమరావతి గురించి మాట్లాడుకోండి**
**- అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు అహంకారపూరితం**
**- మండిపడ్డ మాజీమంత్రి బొత్స సత్యనారాయణ**



విశాఖపట్నం, ఏప్రిల్ 9 : వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు దిగజారి మాట్లాడుతున్నా రని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు ఖండించడానికి తాను మీడియా ముందుకు రాలేదన్నారు. ఆయన వ్యాఖ్యలు అహంకార పూరితంగా ఉన్నాయని బొత్స అభివర్ణించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తనకు మధ్య ఎంతో అనుబంధం ఉందని ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ గుర్తు చేసుకున్నారు. గురువారం రాజధాని అమరావతిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో స్పందించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర రెడ్డిని గుర్తు చేసుకుని బొత్స తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. టీడీపీపై గతంలో మీరు ఏమన్నారో మర్చిపోయారా అంటూ అచ్చెన్నాయుడును ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి

2 లో

## మూడు రాజధానులంటూ
# రుషికొండను మింగారు

**- ఇప్పుడేమో మావిగన్ పేరుతో జోకర్‌గా మారారు**
**- వైఎస్సార్ పేరు తప్ప ఆయన ఆశయాలను తుంగలో తొక్కారు**
**- జగన్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన వైఎస్ షర్మిల**



అమరావతి, ఏప్రిల్ 9 : వైఎస్సార్ తన జీవిత కాలం వ్యతిరేకించిన బీజేపీకి దత్తపుత్రుడుగా జగన్ మారారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు షర్మిల షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇదేనా వారసత్వం అంటే అని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా జగన్ మిగిలారని సెటైర్లు గుప్పించారు. సంక్షేమానికి సారథి దివంగత నేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన

2 లో

## దేశమంతా అమరావతికి ఓకే ..
# జగన్ మాత్రం నో

**- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని**



బాపట్ల, ఏప్రిల్ 9 : ప్రపంచంలో తెలుగువారంతా గర్వించే నగరం అమరావతి అని ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. దేశంలోని అన్ని పార్టీలు అమరావతినే రాజధానిగా కావాలన్నారని పేర్కొన్నారు. ఒకే ఒక్క వైసీపీ మాత్రం అమరావతిని వ్యతిరేకిస్తోందని ధ్వజమెత్తారు. రాజధాని రైతుల పాదయాత్ర ఈ ప్రాంతం గుండా వెళ్లిందని చెప్పుకొచ్చారు. అప్పుడు రైతులకు తాము

2 లో

## వైఎస్ మరణం వేళ ..
# సిఎం పదవి కోసం ఎత్తులు

**- ఆనాడు సంతకాల సేకరణలో జగన్ బిజీ**
**- బొత్స కూడా వైఎస్ మృతిపై అనుమానించారు**
**- ఒక్క అవకాశం అంటూ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు**
**- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు**



అమరావతి, : దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన సమయంలో జగన్ ఎక్కడ ఉన్నారో చెప్పాలని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓ వైపు వైఎస్ ఆచూకీ తెలియక అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం పాకులాడుతారా? అని ప్రశ్నించారు. ఏం జరిగిందో నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాల సేకరణ చేస్తారా? అని విమర్శించారు. అప్పుడు రిలయన్స్ ఏజెన్సీలపై దాడి చేయించారు. మళ్లీ అదే రిలయన్స్‌ను మంచి

2 లో

# సంపాదకీయం

## ఒక యుద్ధం..అనేక చేదు అనుభవాలు !

ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హార్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హార్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా÷- నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు హార్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే హార్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యుఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

## వైఎస్ మరణం వేళ ..సిఎం పదవి కోసం ఎత్తులు

చేసుకుని రాజ్యసభ స్థానాలిచ్చారు. చాలామంది సీనియర్ నాయకులు అనేక రకాలుగా మాట్లాడారు. వైఎస్ మృతి వెనుక జగన్ హస్తం ఉందని సాక్షాత్తూ బొత్సనే మాట్లాడారు. సభ్య సమాజంలో ఎవరూ ఇలాంటి పనులు చేయరని అనుకున్నాం. ఒక సైకోకు పదవీ వ్యామోహం వస్తే.. ఆ పదవి కోసం ఏమైనా చేస్తారు. తండ్రి మరణాన్ని సానుభూతిగా మలచుకుని ఎలా ప్రవర్తించారో చూశాం. తండ్రి మరణం నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు ఎలా సేకరించారో చూశాం అని అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. 2019 ఎన్నికల్లో ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రంపై జగన్‌కు ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. ఎన్డీఏపై అచంచల విశ్వాసంతో ప్రజలు అధికారం ఇచ్చారని తెలిపారు. 22 నెలల్లోనే కేంద్రం సాయంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టామని చెప్పారు. 2004లో రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యారని... నాడు వారి ఆర్థిక పరిస్థితి ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. వైఎస్సార్‌ను జగన్ మానసిక క్షోభకు గురిచేసినట్లు చెప్పారు. వైఎస్ చనిపోయినప్పుడు జగన్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. 'వైఎస్సార్ ఆచూకీపై అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం జగన్ పాకులాడతారా? ఏం జరిగిందో నిర్ధారణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు సేకరిస్తారా? ఇతర రాష్ట్రాల్లో జగన్ ఉండాల్సిన అవసరం ఏంటి?' అంటూ మంత్రి ప్రశ్నల వర్షం కురిపించారు. బాబాయిని కిరాతకంగా చంపింది జగన్ కాదా అని మంత్రి నిలదీశారు. తల్లి, చెల్లిని రోడ్డున పడేసిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. పదవి గురించి తప్ప.. జగన్‌కు మరో ఆలోచన లేదని విమర్శించారు. వైఎస్ మృతిలోనూ జగన్ పాత్ర ఉందన్న అనుమానాలున్నాయని తెలిపారు. సైకోకు పదవి ఇస్తే ఎలా ఉంటుందో జగన్ పాలన చూస్తే తెలుస్తుందన్నారు. వైఎస్సార్ మృతి వెనుక జగన్ హస్తం ఉందని బొత్స సత్యనారాయణనే మాట్లాడారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## దేశమంతా అమరావతికి ఓకే ..జగన్ మాత్రం నో

మద్దతిచ్చామని అన్నారు. గురువారం బాపట్ల జిల్లాలోని భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మంత్రి అనగాని హాజరై మాట్లాడారు. జగన్ హయాంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో గందరగోళం చేశారని ఆగ్రహించారు. జగన్ ఫొటోతో ఉన్న పాస్ పుస్తకాలు మనకు అవసరమా అని ప్రశ్నించారు. రైతుల భూములను 21ఏ లో చేర్చి ఇబ్బందులకు గురి చేశారన్గి ÷ర్ అయ్యారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని ప్రస్తావించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పాసుపుస్తకాలు ఇస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేశారని ఎద్దేవా చేశారు. రైతులు భూమిని ఆత్మగౌరవంగా భావించారని.. అందుకే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని అన్నారు. తుగ్లక్ పార్టీని మరోసారి అధికారంలోకి రాకుండా జనం చూడాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు.

## మూడు రాజధానులంటూ రుషికొండను మింగారు

ప్రతీ పథకం ప్రజల కష్టం, కన్నీళ్ల నుంచి పుట్టిందేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకుడు, మా నాన్న వైఎస్సార్ ప్రజాప్రస్థానం తెలుగు ప్రజల గుండెల్లో ఈరోజుకి పదిలమని షర్మిల చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 9, 2003లో చేవెళ్ల నుంచి ఇచ్చాపురం దాక ప్రజాహితమే పరమావధిగా వైఎస్సార్ చేపట్టిన1457 కిలోమీటర్ల పాదయాత్ర సాగిందని తెలిపారు. ఈ పాదయాత్రకు 23 ఏళ్లని చెప్పారు. వారసులమని చెప్పుకునే జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ పేరును వాడుకున్నారు తప్పితే.. ఆయన ఆశయాలకు వారసులు ఎందుకు కాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. వైసీపీలో నిజంగా వైఎస్సార్ ఐడియాలజీ ఉంటే జగన్ సీఎం అయ్యాక కూడా వైఎస్సార్ జలయజ్ఞాన్ని ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. 'మాట తప్పం మడమ తిప్పం' అనే వైఎస్సార్ లైన్ వాడుకోవడం తప్పిస్తే, పూర్తి మద్యపాన నిషేధమని మాట ఇచ్చి, కల్తీ మద్యం అమ్మి 'ఓన్లీ క్యాష్' మాఫియా ఎందుకు చేశారని షర్మిల ప్రశ్నించారు. వారసులమని చెప్పుకొనే జగన్ కేవలం వైయస్సార్ పేరును మాత్రమే వాడుకున్నారని వైఎస్ షర్మిల విమర్శించారు. వైఎస్ఆర్ ఆశయాలకు జగన్ వారసులు కాలేదని ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ భావజాలం ఉంటే జలయజ్ఞం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. 'వైఎస్ఆర్ వ్యతిరేకించిన భాజపాకి దత్తపుత్రుడిగా ఎందుకు మారారు? ఎస్సీలు, క్రైస్తవులపై దాడులు జరుగుతుంటే మౌనంగా ఎందుకున్నారు? మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి ప్యాలెస్‌లు కట్టారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా మిగిలారు. వైయస్సార్ హయాంలో రాష్ట్రంలోనే ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే మౌనంగా ఎందుకున్నారని షర్మిల ప్రశ్నించారు.

## వైఎస్ గురించి ఎందుకు మాట్లాడుతారు

చనిపోయిన తర్వాత.. తాను, తన భార్య పావురాల గుట్టకు వెళ్లామని పేర్కొన్నారు. కావాలంటే రాజధాని అమరావతిపై మాట్లాడండి.. అంతేకానీ ఏమిటి ఈ మాటలు? అంటూ అచ్చెన్నాయుడిని బొత్స నిలదీశారు. చనిపోయిన వ్యక్తి గురించి ఎందుకు మాట్లాడతారు? అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాలు కోసం ఇంత దిగజారుడా.. ఇదేమి రాజకీయం అంటూ సీఎం చంద్రబాబును బొత్స ప్రశ్నించారు. తానెప్పుడూ పదవుల కోసం పాకులాడలేదని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు బాధాకరమన్నారు. వైఎస్ మరణంపై అచ్చెన్నాయుడు దిగజారి విమర్శలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా బొత్స భావోద్వేగానికి గురయ్యారు. వైఎస్‌తో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. తన మంత్రి పదవితో అచ్చెన్న ప్రజలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. రాజకీయాల్లో గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. జగన్‌పై రాజకీయ విమర్శలు ఎన్నైనా చేయండని.. వైఎస్ఆర్ మరణం ప్రస్తావన తీసుకురావడం అప్రస్తుతమని తెలిపారు. కావాలంటే పాత వీడియో క్లిప్పింగులు చూసుకోవచ్చన్నారు. మావిగన్ నచ్చకపోతే అమరావతే కావాలని చెప్పండని తెలిపారు.

## మావిగన్ పేరుతో మరో నాటకం

పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు. ఉదయం ఏలూరు చేరుకున్న హోం మంత్రికి ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణ, గన్ని వీరాంజనేయులు, రెడ్డి అప్పలనాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.2 కోట్ల 72 లక్షలతో నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని అనిత ప్రారంభించారు. ఆపై పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ప్రతాప్ కిషోర్ పాల్గొన్నారు.

## వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

నాయుడు సహకారంతో నూతనంగా నిర్మించిన మహిళ వసతి భవనానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. మాతృభాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. జన్మనిచ్చిన తల్లి ఊరు, దేశాన్ని ఎవరు మరువకూడదని చెప్పుకొచ్చారు. విద్యార్థులు యువత సోషల్ మీడియా ఊబిలో పడవద్దని సూచించారు. మనిషి జీవన ప్రమాణం మెరుగుపడాలంటే అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను కొనసాగించడం మంచిదని అన్నారు. విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువుతోపాటు ఆటలకు ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన యోగా కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలు స్వాగతించాయని.. అమలు చేయడానికి శ్రీకారం చుట్టాయని ప్రస్తావించారు. తాను రాజకీయ వారసత్వానికి వ్యతిరేకినని.. కానీ సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాల వారసత్వాన్ని ప్రోత్సహిస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.



## నల్లగుట్టపల్లి బీసీ కాలనీ గ్రామంలో వీధి కుక్కల దాడి

### - 14 పొట్టేలు మృతి

రామాపురం(ప్రజా సీమ) : బీసీ కాలనీ గ్రామంలో వీధి కుక్కల దాడి భయాందోళనలకు గురిచేసింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన గంప శ్రీనివాసులు అనే రైతు గొర్రెల కొట్టంలోకి చొరబడ్డ వీధి కుక్కల గుంపు, గొర్రెలపై దాడి చేసి 14 పొట్టేళ్లను చంపేసినాయి. రైతు తెలిపిన వివరాల ప్రకారం, రాత్రి సమయంలో కుక్కలు గొర్రెలపై దాడి చేసి చంపుతున్నట్లు గమనించాడు. వెంటనే కుక్కలను తరిమివేసినా అప్పటికే 14 పొట్టెల్లు మృతి చెందాయి. ఈ ఘటనతో రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ నిరుపేద కుటుంబానికి అప్పు చేసి పోట్టెళ్లను మేపుకుంటున్న వారికి ఒకేసారి 14 పొట్టెళ్లు చనిపోవడంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయారు.మృతిచెందిన పొట్టేళ్ల విలువ 2 లక్షలు రూపాయలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో భయం నెలకొంది. వీధి కుక్కల సంచారం పెరుగుతుండటంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. అలాగే నష్టపోయిన రైతుకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని రైతు కుటుంబం లబోదిబోమంటున్నారు.

## కొత్త ఫించన్ లు ఎప్పుడిస్తారు?

### - కాంగ్రెస్ నేత తులసిరెడ్డి



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: కొత్తగా అర్హులైన వారికి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల ఫించన్ లు ఎప్పుడిస్తారని? కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి సూటిగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలైన ఇప్పటికీ కొత్త ఫించన్ లు ఇవ్వలేదన్నారు. రాష్ట వ్యాప్తంగా దాదాపు 2.50 లక్షల దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. అలాగే విద్యా దీవెన, వసతి దీవెన పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, క్వింటా రూ.2400 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మదనపల్లెలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ రాజు పర్యటన

### - మర్యాదపూర్వకంగా కలిసిన కూటమి నేతలు



మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యునిగా కూటమి ప్రభుత్వం తరపున న్యాయవాదుల విశ్వాసంతో ఘనవిజయం సాధించిన శ్రీనివాన్ రాజు గురువారం మదనపల్లెలో పర్యటించారు.రాజకీయంగా,వృత్తిపరంగా ఈ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.తన విజయం వెనుక నిలిచిన న్యాయవాదులకు,కూటమి పార్టీ నాయకులకు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలియజేయాలనే ఉద్దేశంతో మదనపల్లెకు విచ్చేసిన ఆయనకు బీజేపీ,టీడీపీ మరియు జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు.ఇది కేవలం అభినందన కార్యక్రమం మాత్రమే కాకుండా న్యాయవాదుల ఐక్యతకు,కూటమి బలమైన సంఘటిత శక్తికి ప్రతీకగా నిలిచింది.ఈ కార్యక్రమంలో జాతీయ బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహా రెడ్డి,బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాబ్జీ,విజయభారతి పాఠశాల అధినేత డాక్టర్ సేతు నల్లుస్వామి,రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ అండ్ రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,బీజేపీ రాజంపేట జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి ఆకుల,రాష్ట్ర బీజేపీ యువమోర్చ నాయకులు డాక్టర్ అజ్మతుల్లా ఖాన్,మదనపల్లె బీజేపీ పట్టణ అధ్యక్షులు మఠం కిరణ్ కుమార్తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్ రాజు విజయం వ్యక్తిగత గెలుపు కాదు,న్యాయవాదుల ఆత్మగౌరవానికి,ధర్మపరిరక్షణకు సంకేతమన్నారు.ఆయన నాయకత్వం లో బార్ కౌన్సిల్ మరింత పారదర్శకంగా,న్యాయవాదుల హక్కులను కాపాడే దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ సన్మానం కార్యక్రమంమదనపల్లెలోకూటమిశక్తి,సమన్వయంన్యాయవాదు లపై పార్టీకి ఉన్న అంకితభావాన్ని మరోసారి బలంగా చాటిచెప్పింది.

# శ్రీ ప్రత్యూష హైస్కూల్‌లో ఘనంగా సమ్మర్ సెలబ్రేషన్స్






పుల్లంపేట(ప్రజా సీమ): పుల్లంపేటలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్‌లో ఈరోజు సమ్మర్ సెలబ్రేషన్స్ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వేసవి కాలంలో పాటించాల్సిన ఆరోగ్య పరిరక్షణ చర్యలు, ఆహార అలవాట్లు మరియు దుస్తుల ఎంపికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా హెల్తీ ఫుడ్ ప్రాముఖ్యతను వివరించారు. వేసవిలో తీసుకోవలసిన చల్లని పానీయాలు, శక్తినిచ్చే పండ్లు, కూరగాయల గురించి వివరిస్తూ వాటి పోషక విలువలను తెలియజేశారు. ముఖ్యంగా తగినంత నీరు తాగడం, ద్రవపదార్థాల ప్రాధాన్యతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అలాగే వేసవిలో ధరించవలసిన తేలికపాటి, గాలి ఆడే దుస్తులు మరియు వేడి ప్రభావం నుంచి రక్షించుకునే మార్గాలపై సూచనలు ఇచ్చారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, శీతలపానీయాలను ప్రదర్శించి వాటి ఉపయోగాలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి.వి. రాజశేఖర్ మార్గదర్శకత్వంలో, ఇన్చార్జ్‌లుగా గంజి సుబ్బనరసింహులు, వాకచర్ల రవీంద్రబాబు, నూకల రాధ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దివ్య, రెడ్డమ్మ, శ్రావణి, రజని, నందిని, మహాబూబి, నాగలక్ష్మి, నీలావేణి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

## సింగిల్ విండో చైర్మన్ ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు




రాజంపేట (ప్రజాసీమ): గురువారం రాజంపేట మండల సర్వసభ్య సమావేశంలో మన్నూరు సింగిల్ విండో చైర్మన్ ముల్లగూరి సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు. రాజంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశంలో కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం, రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జి చమర్తి జగన్మోహన్ రాజు సూచన మేరకు మన్నూరు సింగిల్ విండో చైర్మన్ సుబ్రమణ్యం నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని, మండలంలోని అన్ని శాఖలలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలని, ప్రభుత్వ అధికారులు ప్రజలకు చేరువగా ఉండాలని,ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు మరియు మండల ముఖ్య అధికారులు, కూటమి ఎంపీటీసీలు కలసి పాల్గొనడం జరిగినది.

# ఆరోగ్య రాజంపేటే మా లక్ష్యం


- ప్రతి నెల ఉచిత వైద్య శిబిరం
- ఈనెల 16వ తేదీన మెగా నేత్ర ఉచిత వైద్య శిబిరం
- తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు





రాజంపేట,(ప్రజా సీమ): ఆరోగ్య రాజంపేటే లక్ష్యంగా ప్రతి ఒక్కరికి వైద్యం అందించే లక్ష్యంతో ఇకనుంచి ప్రతి నెల ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు.గురువారం నాడు స్థానిక నియోజకవర్గ కార్యాలయం నందు విలేకరుల సమావేశాన్ని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్య సేవలో అందించేందుకు రేడియంట్ వరల్డ్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16 వ తేదిన ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోపరుచుకోవాలని,ప్రజలకు రవాణా సౌకర్యాలు కూడా కల్పిస్తామన్నారు.అంతేకాకుండా వైద్య శిబిరం భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు. ఆయన మాట్లాడుతూ యువత ద్వారా అనేక సాఫ్ట్వేర్ కంపెనీల సహకారంతో రాజంపేటలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక జాబ్ మేళాలను ప్రతినెల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీమ్,టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్,తెలుగు యువత రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రేవూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వైస్ ఎంపీపీ రామిరెడ్డి ద్వాజారెడ్డి



రైల్వేకోడూరు (ప్రజా సీమ): రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్ఆర్ కాంప్లెక్స్ నందు ఉప్పరపల్లికి చెందిన లకిరెడ్డి చెంగల్ రెడ్డి కుమార్తె పల్లవి రెడ్డి ఽ గాజుల గోవర్ధన్ రెడ్డి నిశ్చితార్థ వేడుకలు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వైస్ ఎంపీపీ రామిరెడ్డి ద్వాజారెడ్డి. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చొప్పవెంకట్ రెడ్డి, శంకర్ రెడ్డి,సర్పంచ్ చంగల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ప్రసాద్, షఫీ, లక్ష్మీపతి, మరియు తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వానికి ముఖ్యం

- నాణ్యతలో లోపం వస్తే కఠిన చర్యలు
- ప్రతి విద్యార్థి కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు పెడుతుంది,,,
- భావి భారత పౌరులకు ఎటువంటి లోటు లేకుండా చూస్తాం
- టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు










రాజంపేట,( ప్రజా సీమ): మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు హెచ్చరించారు. గురువారం నాడు రాజంపేట పట్టణం నందు పర్యటిస్తూ గర్ల్స్ హైస్కూల్ ఆకస్మిక తనిఖీలు చేశారు.మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పలు రికార్డులను జగన్ మోహన్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నందు మధ్యాహ్న భోజన పథకం తీరును క్షేత్రస్థాయిలో జగన్ మోహన్ రాజు పరిశీలించారు. అంతేకాకుండా పాఠశాల హెచ్ఎం, సిబ్బందితో కలిసి వంటగది,పాఠశాల పరిసరాల పరిశుభ్రత చమర్తి తనిఖీ చేశారు.అదేవిధంగా విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని,మధ్యాహ్నం భోజనానికి స్వయంగా రుచి చూశారు.రోజు భోజనం బాగుంటుందా , కడుపునిండా మెనూ ప్రకారం అన్నం పెడుతున్నారా అని విద్యార్థులను చమర్తి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం పై వంట నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు చేశారు.పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన,శుచికరమైన ఆహారం అందించడంలో ఎలాంటి అలసత్వం వహించొద్దని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. మొబైల్ ఫోన్స్, టీవీలకు దూరంగా ఉండాలని చమర్తి జగన్ మోహన్ రాజు విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉపాధ్యాయ సిబ్బంది, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పిట్టావాండ్లపల్లి గ్రామంలో గ్రావెల్ రోడ్ నిర్మాణానికి భూమిపూజ

## కార్యక్రమంలో పాల్గొన్న రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి







రైల్వే కోడూరు (ప్రజాసీమ): రైల్వే కోడూరు మండలం,పిట్టావాండ్లపల్లి గ్రామంలో గ్రావెల్ రోడ్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గం టిడిపి పార్టీ ఇంచార్జ్ మరియు కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి పాల్గొన్నారు అనంతరం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా రహదారుల మెరుగుదల ఎంతో ముఖ్యమని, ఈ గ్రావెల్ రోడ్ నిర్మాణంతో గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కలుగుతాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీప్ స్వర్ణోత్సవాల్లో రాయచోటి పూర్వ విద్యార్థులు



తిరుపతి (ప్రజాసీమ) : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం లోని సెంటర్ ఫర్ సౌత్ ఈస్ట్ ఏసియన్ అండ్ పసిఫిక్ స్టడీస్ (సీప్) స్వర్ణోత్సవ వేడుకలలో రాయచోటికి చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, మోటకట్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజలు ఈనెల 6 నుండి 8 వరకు జరిగిన అంతర్జాతీయ సెమినార్ చివరి రోజున హాజరయ్యారు. 1991--1993 బ్యాచ్ పూర్వ విద్యార్థులుగా సెంటర్‌తో తమకున్న అనుబంధాలను పంచుకున్నారు. సీప్ విభాగం అంచలంచలుగా ఎదుగుతూ దేశంలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంచాలకులు పూక రమేష్ బాబు, విభాగ మాజీ సంచాలకులు ఆచార్య రాజారెడ్డి, మునిరత్నంరెడ్డి, జయచంద్రారెడ్డి, ఆచార్యులు విజయ్ కుమార్ రెడ్డి, ప్రయాగ, పద్మజ, తిమ్మప్ప పరిశోధక విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# టిఎన్ యస్ యఫ్ నేత వేణుగోపాల్ పై అసత్య ప్రచారాలు మానుకోవాలి


## నియోజకవర్గ టిడిపి మహిళా నాయకురాలు కోటపాటి సుబ్బమ్మ



సిద్ధవటం (ప్రజా సీమ) : టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ పై ఆసత్య ప్రచారాలు మానుకోవాలని రాజంపేట నియోజకవర్గ టిడిపి మహిళా నాయకురాలు కోటపాటి సుబ్బమ్మ పేర్కొన్నారు. సిద్ధవటం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో గురువారం తన నివాసంలో ఆమె మాట్లాడుతూ సీఎం సహాయనిది బాధితులకు ఇవ్వకుండా టీఎన్ఎస్ఎఫ్ నేత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోసం చేశారని కొన్ని సామాజిక మార్గాలలో అసత్య ప్రచారాలు చేయడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. సియం రిలీఫ్ ఫండ్ బాధితులు మీడియా ముందుకు వచ్చి ఎలాంటి మోసాలు జరగలేదని చెప్పారు. అయినప్పటికీ కొంతమంది అల్లరి మూకలు వేణు పై ఆరోపణలు చేయడం సబబు కాదని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి రాజకీయంగా ఎదుగుదలను చూడలేక కొంతమంది అదే పార్టీలో ఉంటూ రాజకీయాలు చేస్తున్నారని వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని రాజంపేట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి బాట పట్టిందని సమస్యలు పరిష్కారం అవుతున్నాయని పల్లె ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణ పనులు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతున్నాయని ఇప్పటికైనా వేణు పై అసత్య ప్రచారాలు మానుకోవాలి లేకపోతే చట్టపరమైన చర్యలకు సిద్ధమని ఆమె అన్నారు

# మాతృ ఆరోగ్యానికి భరోసా

## గర్భిణీలకు ఉచిత సమగ్ర వైద్య సేవలు: డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ శేఖర్



పుల్లంపేట ప్రజాసీమ న్యూస్ : తిరుపతి జిల్లా పుల్లంపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం కింద గర్భిణీ స్త్రీలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శేఖర్ పర్యవేక్షణలో, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఎస్. అశ్విని చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు . ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల ఆరోగ్య రక్షణతో పాటు మాతృ మరణాల రేటును తగ్గించడం ఈ పథక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ఈ కార్యక్రమంలో ఈసారి సుమారు 38 మంది గర్భిణీలు పాల్గొన్నారు. వారికి బీపీ, షుగర్, హీమోగ్లోబిన్ శాతం, యూరిన్ పరీక్షలు వంటి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య స్థితిని అంచనా వేశారు. అవసరమైన వారికి కాల్షియం, ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రలను పంపిణీ చేశామని తెలియజేశారు. డాక్టర్ అశ్విన్ చంద్ర మాట్లాడుతూ అలాగే ప్రమాదకర గర్భిణీలను ముందుగానే గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తూ, అవసరమైతే ఉన్నత స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. తల్లి ఆరోగ్యం కాపాడితేనే ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తాడని, మాతృ-శిశు సంరక్షణ దేశాభివృద్ధికి కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణీలకు సరైన పోషకాహారం, పరిశుభ్రత, క్రమం తప్పని వైద్య పరీక్షలు, ప్రసవానికి ముందు మరియు తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు మహేశ్వరమ్మ, మహేష్, సుబ్బారెడ్డి, ప్రసన్న కుమార్‌తో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొని సేవలను అందించారు.

# చాపలమడుగు సుభాషిణి మరణం -- పలువురు నేతల నివాళులు

పుల్లంపేట/ఓబులవారిపల్లి: ప్రజాసీమ న్యూస్ : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం వాసుదేవపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువనేత చాపలమడుగు సూర్యప్రకాశ్ గారి మాతృమూర్తి చాపలమడుగు సుభాషిణి గారు అకస్మాత్తుగా మరణించగా, గురువారం వారి స్వగృహంలో పార్థివ దేహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, టిడిపి యువ నాయకుడు ముక్క సాయి వికాస్ రెడ్డి తదితరులు హాజరై పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చాపలమడుగు శివయ్య, జనార్ధన నాయుడు, బొక్కసం సునీల్, చాపలమడుగు మహేష్, కావేటి వెంకటసుబ్బయ్య రొంపిచర్ల మురళి ఇండ్లూరు బాబు, క్లస్టర్ ఇంచార్జ్ కాకర్ల రెడ్డయ్య, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై వేమూరి రాధాకృష్ణ వ్యాఖ్యలు దుర్మార్గం

## - నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో వైసిపి శ్రేణుల నిరసన
## - చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు







మదనపల్లె (ప్రజా సీమ): మహిళా స్త్రీమూర్తులను పూజించే భారతదేశంలో రాధాకృష్ణ లాంటి వ్యక్తులు మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం దురదృష్టకరమని మదనపల్లె వైయస్సార్సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ పైన విషం చిమ్ముతూ ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలపై గురువారం మదనపల్లె టూటౌన్ పోలీసులకు నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో వైఎస్సార్సిపి నాయకులు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ వైయస్సార్సిపి అధిష్టానం ఆదేశాల మేరకు మదనపల్లె టూటౌన్ పోలీసులకు ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణపైన చర్యలు కోరుతూ ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. భారతదేశం పవిత్రమైన నేల ఆడవారిని పూజించే సంస్కారం వుందని,రాధాకృష్ణ లాంటి దుష్టశక్తులు ఆడవారిని కించపరిచే విధంగా మాట్లాడటం శోచనీయమన్నారు. మీ పేరులోని రాధ అని స్త్రీమూర్తి పేరు వుంది,మీరే ఈ విధంగా కించపరిచే విధంగా మాట్లాడటం సిగ్గుచేటని విమర్శలు గుప్పించారు. టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు చూస్తే అలా,ఈయన ఇలా వీరికి సిఎం చంద్రబాబునాయుడు వెనక్కి వేసుకుని రావడం దురదృష్టకరమని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిజం ముసుగులో ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ మహిళలను కించపరిచే విధంగా రాతలు రాయడం,వ్యాఖ్యలు చేయడం,దానికి చంద్రబాబునాయుడు మద్ధతునివ్వడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలలో మహిళల పట్ల పూర్తి అగౌరవం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. రాధాకృష్ణ తన వైఖరిని మార్చుకుని క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వైయస్సార్సిపి శ్రేణులు అంతా ఆంధ్రజ్యోతి దినపత్రిక,ఏబిఎస్ ఛానల్ బహిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ మనూజా రెడ్డి,ఎస్ఈసి మెంబర్ షమీమ్ అస్లాం,మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి విఎస్.రెడ్డి,నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు డి.హర్షవర్ధన్ రెడ్డి,సీనియర్ నాయకులు ఎల్.రఘునాథ రెడ్డి,అన్నమయ్య జిల్లా యువనాయకులు తోట పవన్ తేజ,ఎన్.మస్తాన్ ఖాన్,శీలం రమేష్,నరసింహులు,సురేంద్ర,లియాఖత్ అలీ,ఇర్ఫాన్,డిజిటల్ కో-ఆర్డినేటర్ యాసిన్,కృష్ణారెడ్డి,ప్రసాద్ బాబు,జబి,నవాజ్,నాగరాజ రెడ్డి,మహేశ్,ఆవుల సోమశేఖర్ రెడ్డి,ఆవుల మల్లికార్జున,పాల్ చంద్రశేఖర్,మజ్జిగ కేశవ యాదవ్,చెన్నకృష్ణ,శంకర్ నాయక్,మాలెపాడు చలపతి,శ్రీనివాసులు,వడిగల శ్రీకాంత్ రెడ్డి,చరణ్,నజీర్,శారద రెడ్డి,నాగమణి,అపర్ణ,మేరీ,వినుతా భాయి,మంజుల,లలితమ్మ,మహేశ్ బాబు మరియు వివిధ మండలాల పార్టీ నాయకులు,అభిమానులు,మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మిట్స్ యూనివర్శిటీ విద్యార్థి అద్భుత ఆవిష్కరణ

## - రైడ్-షేరింగ్,వాహన అద్దె ప్లాట్‌ఫాంకై గోసాత్.కామ్ రూపకల్పన
## - అభినందించిన ఛాన్సులర్ ఎన్.విజయ్ భాస్కర్ చౌదరి



కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) మూడవ సంవత్సరం చదువుతున్న కలిచెర్ల వేణుమాధవ్ గోసాత్ పేరుతో ఒక వినూత్న రైడ్-షేరింగ్ మరియు వాహన అద్దె ప్లాట్‌ఫారమ్‌ను రూపొందించారు. ఈ ప్లాట్‌ఫారమ్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ గురువారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రవాణా అవసరాలను ఆధునీకరించే లక్ష్యంతో రూపొందించబడిన ఈ యాప్,ప్రయాణికులు మరియు డ్రైవర్లకు ఉపయోగపడేలా తక్కువ ఖర్చుతో కూడిన రూట్-మ్యాచింగ్ సదుపాయం,నమ్మకమైన రైడ్-ట్రాకింగ్ ఫీచర్లను అందిస్తుందన్నారు. ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా డ్రైవర్లు తమ ఖాళీ సమయాన్ని వినియోగించి అదనపు ఆదాయం పొందే అవకాశముండగా,ప్రయాణికులు తక్కువ ఖర్చుతో సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకునే వీలుంటుంది. యూనివర్సిటీ స్థాయి నుండే ఇలాంటి సాంకేతిక పరిష్కారాన్ని అభివృద్ధి చేయడం యువతలో ఉన్న ఆవిష్కరణాత్మక ఆలోచనలకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తు లో ఈ యాప్‌ను మరింత విస్తరించి,కొత్త ఫీచర్లను జోడించి పెద్దస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం గోసాత్.కాంను సందర్శించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సనత్ హేగ్డే,డీన్-అకాడెమిక్స్ డాక్టర్ రామ ఎస్.కొమరగిరి,విభాగాధిపతి డాక్టర్ ఆర్.కల్పనా,డాక్టర్ చొక్కనాథంలు పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణ చేసిన వేణుమాధవని మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి,ప్రో ఛాన్సలర్ యెన్ ద్వారకానాథ్,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎన్.ఎస్.యూ.ఐ కృషి

## - ఘనంగా ఎన్.ఎస్.యూ.ఐ ఆవిర్భావ దినోత్సవం.

పీలేరు (ప్రజా సీమ) : కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్.ఎస్.యూ.ఐ) విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ తెలిపారు. గురువారం ఎన్.ఎస్.యూ.ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పీలేరు పట్టణంలో జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఎన్.ఎస్.యూ.ఐ సమర్థవంతంగా పనిచేస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో ముందుకు సాగుతుందని అన్నారు. విద్యార్థులకు రక్షణ కవచంలా ఉండి వారి హక్కుల కోసం పోరాడుతుందని తెలిపారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫీజులు చెల్లించలేకపోయినా, సర్టిఫికెట్లు ఇవ్వకపోయినా, స్కాలర్షిప్ మరియు రీయింబర్స్మెంట్ రాకపోయినా అలాగే విద్యార్థులకు ఏ సమస్యల వచ్చిన ఎన్.ఎస్.యూ.ఐ స్పందించి పరిష్కారం చూపిస్తుందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా నిరంతరం




పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీకి అనుబంధ విద్యార్థి విభాగమైన ఎన్.ఎస్.యూ.ఐని, మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గారు 1971 ఏప్రిల్ 9న కేరళ స్టూడెంట్స్ యూనియన్ మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఛత్ర పరిషత్‌లను విలీనం చేసి స్థాపించారని వివరించారు. వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి, హరీష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# అంబేద్కర్ భవన్ స్థలం కొరకు ఆదేశాలు జారీ చేయాలి



పీలేరు (ప్రజా సీమ) : పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ సర్వే నెంబర్ 1414 పరిధిలో (1.0.600 సెంట్ల)గల గయ్యాలు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అంబేద్కర్ భవన్ కు మరయు ఎస్సీ/ఎస్టీ లకు ఇంటి నివేశ పట్టాలు మంజూరు చేసేలా ఆదేశాలు జారీచేయాలని జిల్లాల పర్యటనలో భాగంగా నేడు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ జవహర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ పరిధిలో గల సర్వే నెంబర్ 1414/1లో 0.2300, సెంట్లు గయ్యాలు,1414/2లో 0.1300, సెంట్లు రస్తా పోరంబోకు,1414/3లో 0.4500, సెంట్లు గయ్యాలు,1414/4లో 0.2500, సెంట్లు గయ్యాలు,పురా విస్తీర్ణం(1.06.00 సెంట్లు) గల గయ్యాలు భూములను,రస్తా పోరంబోకు భూమిని ఆక్రమణ చేసుకొని చదును చేసి ప్లాట్ల రూపంలోకి మార్చి విక్రయలు చేపట్టారు పై సర్వే నంబర లలో గల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలి,మరియు సర్వే నెంబర్ 1414/5లో 0.4900, సెంట్లు గల అసైన్ మెంట్ భూమిని,మరియు 1414/6లో 0.3500, సెంట్లు గల భూమిని దరఖాస్తు పట్టా రూపంలో భూస్వాములకు మంజూరు చేశారు వీరికి మంజూరు చేసిన భూములు ఎ విదంగా పంపిణి చేశారో విచారణ జరిపి దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు రెవిన్యూ డివిజన్ గా ఏర్పడిన సందర్భంగా పీలేరు చుట్టుపక్కల ప్రాంతాల భూములకు అమాంతం రెక్కలొచ్చినట్టు భూముల రేట్లు పెరిగాయి పీలేరు గ్రామపంచాయతీ స్థాయి నుండి మున్సిపాలిటీగా మారుతున్న వేళ రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో డివిజన్ స్థాయిలో ప్రభుత్వ పరిపాలన సౌలభ్యం కొరకు రెవిన్యూ డివిజనల్ కార్యాలయం, జాయింట్ కలెక్టర్ కార్యాలయం,డి.యస్.పి, కార్యాలయం,ఇలా అనేక ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణం కొరకు ప్రభుత్వ భూముల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని కబ్జాలకు,ఆక్రమణలకు,గురైన ప్రభుత్వ గయ్యాలు భూములు, డి.కె.టి,భూములను గుర్తించి రెవిన్యూ శాఖ అధికారులు నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలి, పార్టీలకు అతీతంగా కబ్జాలకు,ఆక్రమణలకు,పాల్పడిన వారు ఎంతటి వారైనా వారిపైన కేసులు నమోదు చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలి మండలంలో చుట్టు పక్కల గ్రామాల్లో ఉన్న అసైన్ మెంట్ భూములు,సీలింగ్ భూములు,ఇరిగేషన్ భూములను గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలి దొడ్డిపల్లి పంచాయతీ సర్వే నెంబర్ ౧1414లో గల ప్రభుత్వ గయ్యాలు భూమిని పరిశీలించి అందరికి అందుబాటులో ఉండే అనువైన స్థలాన్ని మంజూరు చేయాలని వినతి సమర్పించారు

# ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

పీలేరు,(ప్రజా సీమ) : వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మార్చి 16 నుండి పాఠశాలలను ఒంటిపూట బదులు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, పీలేరు మండలంలో కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఆ ఆదేశాలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ రోజంతా తరగతులు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ, వై.ఎస్.ఆర్.ఎస్.యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. నరేష్ కుమార్, ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు సి. సాయి సంపత్ కలిసి పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యా శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలోనే నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న తరగతులను తక్షణమే నిలిపివేయించి, విద్యార్థులను ఇండ్లకు పంపించారు. ఈ సందర్భంగా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "విద్యా శాఖ అధికారులు ఏమి చేస్తున్నారు?" అని ప్రశ్నించారు.పీలేరు మండలంలో నిబంధనలు బహిరంగంగా ఉల్లంఘిస్తున్నప్పటికీ, మండల విద్యా శాఖ అధికారులు కనీస పర్యవేక్షణ కూడా చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విద్యా సంస్థలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆ పాఠశాలలపై సీజ్, గుర్తింపు రద్దు వంటి చర్యలు తీసుకోవాలని



డిమాండ్ చేశారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పీలేరు మండల విద్యా శాఖ అధికారులపై కూడా వెంటనే చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించిన పక్షంలో ఎన్.ఎస్.యూ.ఐ ,వై.ఎస్.ఆర్.ఎస్.యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి విద్యా శాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు కాపాడడంలో విద్యార్థి సంఘాలు ఎప్పటికీ ముందుంటాయి అని స్పష్టం చేశారు.

# కలకడ పంచాయితీ వనరుల బహిరంగ వేలం పోటా పోటీగా బిడ్లు

## - పంచాయతీకి భారీ ఆదాయం





కలకడ(ప్రజా సీమ) : కలకడ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు గ్రామానికి ఆదాయం వచ్చే వనరులపై బహిరంగ వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు ప్రత్యేక అధికారి అయినా భానుప్రసాద్ అధ్యక్షత వహించగా, పంచాయతీ అభివృద్ధి అధికారి శైలజ ఆధ్వర్యంలో కార్యక్రమం సజావుగా జరిగింది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీకి చెందిన దినసరి కూరగాయల మార్కెట్, టమోటా మార్కెట్, వారపు సంత, బస్టాండ్ గేటు, షాపింగ్ రూములు (1, 2, 3), జంతువుల వధశాల వంటి వనరులను బహిరంగంగా వేలం వేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీగా బిడ్లు వేయడంతో, ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధరల కంటే ఎక్కువ మొత్తానికి ఈ వనరులు కేటాయించబడ్డాయి. కూరగాయల ఽ టమోటా మార్కెట్‌ను సి. రమణ రెడ్డి ?24.80 లక్షల నుంచి ?45.55 లక్షలకు పొందారు. వారపు సంతను ఎస్. ముబారక్ అలీ ?15.40 లక్షల నుంచి ?20.10 లక్షలకు పొందారు. బస్టాండ్ గేటును పి. ఖాదర్ వలీ ?1.70 లక్షల నుంచి ?2.10 లక్షలకు పొందారు. షాపింగ్ రూమ్-1 నెలకు ?14,000 నుంచి ?14,100కు కేటాయించారు. షాపింగ్ రూమ్-2 ను ఎస్. బబ్లు ?11,000 నుంచి ?12,100 నెలకు పొందారు. షాపింగ్ రూమ్-3 ను ఎం. రెడ్డి భాష ?11,000 నుంచి ?15,000 నెలకు పొందారు. జంతువుల వధశాలను మస్తాన్ వలి ?2,500కే పొందారు.ఈ బహిరంగ వేలం ద్వారా గ్రామపంచాయతీకి గణనీయమైన ఆదాయం లభించగా, ప్రజలు పారదర్శకంగా పాల్గొని వేలాన్ని విజయవంతం చేశారు. అధికారులు ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించడంతో పాటు గ్రామాభివృద్ధికి ఈ ఆదాయం ఉపయోగపడుతుందని తెలిపారు.

# వైభోవహితంగా అమ్మవారి జాతర

## బోనాలు సమర్పించిన మహిళలు



సిద్ధవటం (ప్రజాసీమ ) : గంగమ్మ జాతర పురస్కరించుకొని మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు మండలంలోని నేకనాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో వెలిసిన గ్రామదేవత గంగమ్మ అమ్మవారి జాతర సందర్భంగా గురువారం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి తమ మొక్కులు సమర్పించారు గ్రామ మాజీ సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ కాలనీలో వెలిసిన శ్రీ గంగమ్మ అమ్మవారు జాతర మహోత్సవం సందర్భంగా మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమతో అలంకరించి పెద్ద ఎత్తున మహిళలు చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు అని తెలిపారు మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్సీ కాలనీ నివాసులు పాల్గొన్నారు

# ఘనంగా పోషణ పక్షోత్సవం

## - సిడిపిఓ వి.సునీత




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: పోషణ పక్షోత్సవాలను ఘనంగా ప్రారంభించినట్లు వేంపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వి.సునీత అన్నారు. గురువారం స్థానిక హరిజనవాడ, బక్కన్నగారిపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0-2 ఏళ్ల పిల్లల మెదడు అభివృద్ధి, బృహత్ దశగా పరిగణించాలని, ఆ వ్యవధిలోనే 80 శాతం మెదడు అభివృద్ధి చెందుతుందన్నారు. దీనికి తల్లిదండ్రులు, కుటుంబం సభ్యులు తోడ్పాటు అందించాలని కోరారు. ఆ దశలో మంచి విషయాలు నేర్పడం వల్ల న్యూరాన్ ల కనెక్టివిటి పెరిగి మెదడు అభివృద్ధి బాగా జరుగుతుందన్నారు. జంక్ ఫుడ్ ని దూరంగా ఉంచి, ఇంట్లో ఒండిన ఆహారాన్ని పిల్లలకు అలవాటు చేయాలని సూచించారు. ఆకుకూరలు, పండ్లు, పాలు, ధాన్యాలు, పప్పు దినుసులతో కూడిన సమతుల్య ఆహార అలవాట్ల ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం బాగుండి పిల్లల అభివృద్ధికి దోహదం చేస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు స్వర్ణలత, సుభద్ర తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

## - విబిజీ రామ్ జీ ని రద్దు చేయాలి - పాదయాత్రను జయప్రదం చేయండి




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని సిపిఐ ప్రాంతీయ కార్యదర్శి వెంకట రాములు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వ దాడిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 12 వరకు, అనంతపురం నుంచి బండ్లపల్లి వరకు పాదయాత్ర చేపట్టారని, ఆ పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కష్ట జీవుల జీవనానికి ఎంతో ఉపయోగ పడే ఆ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం వేసే విధంగా విబిజీ రామ్ జీ పథకాన్ని రూపొందించినట్లు ఆరోపించారు. దీంతో పేదలకు భారీ నష్టం కలుగుతుందన్నారు. సిపిఐ ప్రాంతీయ సహాయ కార్యదర్శి బ్రహ్మం, నాయకులు చాంద్ బాషా, సుభాహాన్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


# అన్నమయ్య జిల్లా ఎస్పీని కలిసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు



కలకడ (ప్రజా సీమ) : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కలకడ ప్రతినిధులు జిల్లా ఎస్పీ నీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు బరకం శ్రీనివాసుల రెడ్డి, డీసీ మెంబర్ దగ్గుబాటి వెంకటేశ్వర రావు, కార్యదర్శి పునీత్ చౌదరి, సభ్యులు ఎస్. కాంతారావు (మాజీ ఎంపీపీ), బాలినేని హారినాథ్ నాయుడు, ఈ. రెడ్డి శేఖర్ (రిటైర్డ్ ఎంఈఓ), భరత్ రాజ్ పాల్గొన్న ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ ద్వారా ప్రాంతంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎస్పీ కి వివరించారు. ముఖ్యంగా సామాజిక సేవ, విద్యా అభివృద్ధి, పేదలకు సహాయం వంటి అంశాలపై క్లబ్ చేస్తున్న కృషిని వివరించారు. భవిష్యత్తులో పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని వారు అభిలాష వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ లయన్స్ క్లబ్ సభ్యుల సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. సమాజ అభివృద్ధికి ఇలాంటి సంస్థలు ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు.

# 'మన ఊరు -- మన జెండా' కార్యక్రమం





పుల్లంపేట ప్రజా సీమ న్యూస్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 'మన ఊరు -- మన జెండా' కార్యక్రమం పుల్లంపేట మండలంలోని శ్రీరాములుపేట, కొత్తపేట గ్రామాల్లో గురువారం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల బిజెపి అధ్యక్షుడు కె. మనోహర్ రెడ్డి, సీనియర్ నాయకులు గడ్డం చెంగల్ రాజు, కంబాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చేనేత కార్మికులకు సిల్క్ రాయితీలను వెంటనే విడుదల చేయాలి

**- బి.సి సంక్షేమ,చేనేత జౌళిశాఖ మంత్రి సవితమ్మకి వినతి**

**- ఏపి బిసి సంక్షేమ సంఘం,చేనేత రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీరభాస్కర్ వెల్లడి**



మదనపల్లె (ప్రజా సీమ) : రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బి.సి సంక్షేమ,చేనేత జౌళిశాఖ మంత్రి సవితమ్మని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం చేనేత రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీర భాస్కర్ కోరారు. గురువారం విజయవాడలోని క్యాంపు కార్యలయం బి.సి సంక్షేమ శాఖ,చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవితమ్మని ఉత్తరాంధ్ర చేనేతల సమస్యలు ముఖ్యంగా అనకాపల్లి జిల్లా చేనేత సహాకార సంఘాలు సమస్యలు,గతంలో కార్పేట్స్,ట్రైనింగ్ ప్రోగ్రాంలపై చర్చలు జరపడం జరిగిందన్నారు. చేనేత సంఘాలలో నేత వస్త్రాలు నిలువలు గురించి,రాష్ట్రవ్యాప్తంగా పట్టు రాయితీ పాస్ పుస్తకాలు నెలకు రూ.3000 చొప్పున అమలు చేయాలన్నారు. అదేవిధంగా చేనేత కార్మికులను జీవనోపాధి కల్పించి,చేనేత గుర్తింపు కార్డులు లేనివారికి అమలు చేయాలని,బి.సి మహిళలు టైలర్స్ ఆభివృద్ధి విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు విషయాలు వారి దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని,అదేవిధంగా వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వెంటనే మంత్రి స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ల ద్వారా ఈ యొక్క సమస్యలు వివరించడం జరిగిందన్నారు. విజయవాడలో ఉన్న చేనేత డిప్యూటీ కమిషనరుకి తక్షణమే ఈ సమస్యలపై దృష్టి పెట్టాలని ఫోన్ ద్వారా సూచించారన్నారు. విజయనగరం ఎడి మురళీకృష్ణకి పోన్ ద్వారా చేనేతల సమస్యలపై నిర్లక్ష్యం మంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడం మాకు ఆశ్చర్యం వేసిందన్నారు. అనకాపల్లి జిల్లా బి.సి చేనేత రాష్ట్ర ఏఐడబ్ల్యూ జేఏసీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మాడెం సూరి అప్పారావు,విజయ్ కుమార్,దిగుడు భాస్కర్,రవితేజ తదితరులు పాల్గొన్నారు

# అకాడమిక్ ఆడిట్‌లో మహిళా డిగ్రీ కళాశాలకు 'ఎ' గ్రేడ్

**- ధృవీకరణ పత్రం అందుకున్న ప్రిన్సిపాల్ వై.వనజ**







మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకాడమిక్ ఆడిట్‌ను కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటర్లుగా విచ్చేసిన డాక్టర్ ఎం.రుక్మిణి,డాక్టర్ ఎస్.గులాబ్ జాన్ కళాశాలలోని రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి,వాటి నిర్వహణను పరిశీలించి ధ్రువీకరించారు. ఈ ఆడిట్‌లో కళాశాలకు ఎ గ్రేడ్ లభించినట్లు ప్రిన్సిపాల్ వై.వనజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలకు ఎ గ్రేడ్ లభించిందని,ఇది కళాశాలకే గర్వకారణమన్నారు. దీని వెనుక కళాశాల అధ్యాపకులు కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన మరియు బోధనేతర సిబ్బంది అందరూ పాల్గొన్నారు. అకాడమిక్ ఆడిట్ ద్వారా విద్యా ప్రమాణాలు,బోధనా పద్ధతులు,విద్యార్థుల అభివృద్ధి వంటి అంశాలను సమీక్షించారు. భవిష్యత్తులో మరింత మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు,అలాగే నాక్ గ్రేడింగ్‌కు సిద్ధమయ్యే దిశగా తీసుకోవలసిన చర్యలపై అకాడమిక్ ఆడిటర్లు ఎగ్జిట్ మీటింగ్‌లో సూచనలు,సలహాలు అందించారు. రికార్డుల పరిశీలన కార్యక్రమం అకాడమిక్ కో-ఆర్డినేటర్ వి.గురుమూర్తి మరియు ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ టి.టి.పి మోహన్ బాబు ఆధ్వర్యంలో జరిగింది.

# మానవత ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**- పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ మండల శాఖ ఛైర్మన్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు డా.యోగీశ్వర్ బాబు లు వెల్లడించారు. ఈనెల 12న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. వివిధ రకాల సాధారణ వైద్య సేవలతో పాటు స్త్రీ సంబంధిత వ్యాధులపై, కంటి సంబంధిత వ్యాధులపై ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వేంపల్లె మండల ప్రజలు, పరిసర ప్రాంతాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చేటప్పుడు ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలని, తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు వేంపల్లె మానవత స్వచ్ఛంద సేవా సంస్థని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.






# వైభవంగా ముగిసిన తెట్టు శ్రీ పాలేటి గంగమ్మ జాతర

కురబలకోట (ప్రజా సీమ) : కురబలకోట మండలం,తెట్టు గ్రామం నందు వెలిసిన శ్రీ పాలేటి గంగమ్మ తల్లి జాతర ఏప్రిల్ 6 తేదీ బోనాలతో ప్రారంభమై 7 తేదీ రాత్రి తిరుణాల మరియు 8వ తేదీ పగలు తిరుణాల ముగిసింది. భక్తుల కోర్కెలు అమ్మవారు తీర్చినందుకుగాను,భక్తులు వివిధ ఊర్ల నుండి జాతరకు ఈ సంవత్సరం వివిధ రకాల విద్యుత్ అలంకరణలతో 36 చాందిని బండ్లు అమ్మవారి గుడి దగ్గరకు వచ్చి,భక్తులందరికీ కనువిందు చేశాయి. చాందిని బండ్ల ముందర ఏర్పాటు చేసిన కోలాటాలు వివిధ నాట్యాలు భక్తులందరినీ ఆకట్టుకున్నాయి. మూడు రోజులు అన్నసంతర్పణ కార్యక్రమం సజావుగా జరపడం ఈ జాతరకు ప్రత్యేకతను సంతరించుకుంది. సుమారుగా 40వేల మంది భక్తులు ఉల్లాసంగా అమ్మవారి సన్నిధిలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షములు పొందారని ఆలయ కమిటీ చైర్మన్ పూజారి అంజి తెలియజేశారు. ఈ సందర్భంగా అమ్మవారి జాతర సజావుగా జరిపినందుకు భక్తులకు,మీడియా మిత్రులకు,రెవిన్యూ సిబ్బందికి,పోలీస్ శాఖకు,మండల అధికార యంత్రాంగంకు,ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంటుకి,పంచాయితీ మరియు గ్రామ సచివాలయ సిబ్బందికి,హెల్త్ డిపార్ట్మెంట్ కి,ఎండి సప్లయర్స్ ఫిరోజ్, అమ్మవారి అలంకరణకు సాయం చేసిన భక్తాదులకి,దేవాలయం నందు వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించిన భక్తాదులకి,అన్నసంతర్పణ కార్యక్రమానికి సహాయం చేసిన ప్రతి ఒక్కరికి,సోషియల్ మీడియా మిత్రులందరికీ,దేవాలయ అభివృద్ధికి సహకరించిన భక్తులకి,దేవాలయ సిబ్బందికి మరియు దేవాలయ కమిటీ మెంబర్లకి,ప్రతి ఒక్కరికి పేరుపేరునా పూజారి అంజి ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా భక్త ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**- హాజరైన వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్**

**- స్వాగతం పలికిన గ్రామస్తులు,వైసీపీ నాయకులు**



మదనపల్లె (ప్రజా సీమ) : రామసముద్రం మండలం,మినికి గ్రామంలో భక్త ఆంజనేయ దేవాలయం పునర్నిర్మాణం మరియు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం గురువారం వైభవం జరిగింది. ఈ ప్రతిష్ట మహోత్సవానికి మదనపల్లె నియోజకవర్గం వైయస్సార్ సిపి సమన్వయకర్త ఎన్.నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని అందుకు ధర్మకర్తలను,గ్రామ ప్రజలను అభినందిస్తున్నానని,ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి విఎస్.రెడ్డి,సీనియర్ నాయకులు ఎల్.రఘునాథ రెడ్డి,ఆలయ ధర్మకర్త సుబ్బ రెడ్డి,రామసముద్రం మండల కన్వీనర్ కేశవరెడ్డి,ఎంపిపి వెంకటరమణ రెడ్డి,కృష్ణా రెడ్డి,వాసుదేవ రెడ్డి,నాగరాజ,సుజ్ఞానమూర్తి,రవికుమార్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,బాబు హరి,తిమ్మయ్య,భాస్కర్ గౌడ్,రెడ్డి వీరే గౌడ్,గవెన్న,జబి,శంకర్ నాయక్,తిమ్మా రెడ్డి,మాలేపాడు చలపతి,అశోక్ పాల్గొన్నారు.

# సందడి వాతావరణంలో జీవి నాయుడు కుమార్తె వివాహ వేడుక

**- హాజరైన జునైద్ అక్బరీ,శ్రీరామ్ చినబాబు**

**- తరలివచ్చిన టిడిపి నాయకులు,కూటమి పార్టీల నేతలు**





మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లి నియోజకవర్గం,పొన్నీటిపాళ్యం పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గూని వెంకటరమణ నాయుడు (జి.వి. నాయుడు) జ్యేష్ఠ కుమార్తె నాగమల్లిక, నరసింహులు నాయుడుల వివాహ వేడుక బుధవారం రాత్రి పాత బైపాస్ రోడ్డు నందుగల ఆర్ఆర్ కళ్యాణమండపం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయుడు జునైద్ అక్బరీ,తెలుగు యువత రాష్ట్రఅధ్యక్షులు శ్రీరామ చినబాబు,టౌన్ బ్యాంక్ ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్,కట్టా దొరస్వామి నాయుడు తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. జి.వి. నాయుడు తెలుగుదేశం పార్టీకి వీరవిధేయుడిగా,అందరితో మంచి సంబంధాలు కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. తన కుమార్తె వివాహానికి ఆయన అందరినీ ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో మదనపల్లి,తంబళ్లపల్లి నియోజకవర్గాల నుండి పెద్దఎత్తున టిడిపి,కూటమి పార్టీల నేతలు హాజరు కావడంతో కళ్యాణ మండపం ఆవరణం సందడి వాతావరణం నెలకొంది. ముందుగా అతిథులకు జీవి నాయుడు కుటుంబ సభ్యులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీవి నాయుడు మాట్లాడుతూ మా ఆహ్వానం మేరకు నా కుమార్తె వివాహానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించిన యువ నాయకుడు జునైద్ అక్బరీ,ఇతర టిడిపి నాయకులు,కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. భ విష్యత్తులను అందరి ఆదరాభిమానాలు ఇలాగే మా కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అందరికీ విందు భోజనం వడ్డించారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరం

## – ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



జగ్గయ్యపేట: ఏప్రిల్ 9 (ప్రజా సీమ): జగ్గయ్యపేట నియోజకవర్గం లో గల నందిగామ మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు 15 మంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను రూ. 7,20,504 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం నందిగామ మండలం మాగల్లు గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా రామిరెడ్డిపల్లి గ్రామంలో దాతల సహకారంతో నిర్మాణంలో ఉన్న స్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే బోర్‌వెల్‌కు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ నాయకులు స్మశాన వాటిక అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరగా, వెంటనే స్పందించిన ఆయన అంచనాలు సిద్ధం చేసి తీసుకురాగానే అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా బలహీన వర్గాలకు వైద్య చికిత్స ఖర్చులు భారంగా మారిన సందర్భంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపశమనాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద ప్రజల మెడికల్ బిల్లులను స్థానిక నాయకులు తమ దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సహాయం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేస్తే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుంది





(ప్రజా సీమ)అమరా వతి, ఏప్రిల్ 9: పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటే సమాజం కూడా ఆరోగ్యవంతంగా ఉంటుందని,గర్భిణీలు బలమైన పోషకాహారాన్ని తీసుకోవాలని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తుళ్లూరు సాంబశివరావు అన్నారు. జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వివిధ రకాల వైద్య పరీక్షలకు ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు గురువారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీ క్రమం తప్పకుండా గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను చేసేందుకు ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు ఇతర గ్రామాల నుండి గర్భిణీలు ఉదయమే ఆస్పత్రికి వస్తారని వారు ఇంటికి వెళ్లేందుకు లేట్ అవుతుందని అందువల్లనే ప్రతి గర్భిణీ స్త్రీ కడుపు నింపడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి ప్రతినిధి షేక్ లియాకత్ ఆలి,దాసరి విజయ్ బెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు. గర్భిణీలకు పెరుగన్నం,ఒక్కొక్కరికి రెండు కోడిగుడ్లు,రాగి జావా, డ్రైవుడ్ లడ్లు, దానిమ్మకాయలు,అరటి పండ్లు,బత్తాయి కాయలు, శనగ విత్తనాల లడ్లు తదితర పౌష్టికాహారాన్ని గర్భిణీలకు పంపిణీ చేశారు.

# పోషణ పక్వాడ కార్యక్రమంతో చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేయండి

## జిల్లా కలెక్టర్ విజయ సునీత




మార్కాపురం,ఏప్రిల్ 9 :పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం పోషణ్ పక్వాడ ఉత్సవాల కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఇన్చార్జి పీడి పద్మావతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ 15 రోజుల( ఏప్రిల్ 9 నుంచి 23వ తేదీ వరకు) ఉత్సవాల కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాలతో పోషణ ర్యాలీలు నిర్వహించి, ప్లకార్డులు, ఆకర్షణీయ నినాదాల ద్వారా ఆరోగ్య సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. 0 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించేందుకు వంటల పోటీలు సైతం నిర్వహించాలని సూచించారు. పోషణ ప్రాముఖ్యతపై తాతలు, అమ్మమ్మలు కథలు చెప్పడం ద్వారా సమాజ స్థాయిలో పరస్పర అభ్యాసం అనుభవాలు పంచుకోవచ్చన్నారు. దీని ద్వారా చిన్నారుల్లో మానసిక పరిపక్వత వస్తుందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లల కోసం స్థానికంగా లభ్యమయ్యే పోషకాహారం వంటకాల ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులకు పిల్లల ఆరోగ్యం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు.

# ముదినేపల్లి మండల బి.జే.పీ.పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ గా బి.బి.వి.నరసింహారావు



(ప్రజా సీమ)ఏప్రిల్ 9(ముదినేపల్లి):బి.జే.పి.పార్టీ ఆదేశానుసారం ఏలూరు జిల్లా పార్టీ ద్వారా కైకలూరు నియోజక వర్గ ఏం.ఎల్.ఏ.కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో బి.జే.పి.పార్టీ సీనియర్ నాయకులు,మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ ఆధ్వర్యంలో బిజే.పీ.పార్టీ ముదినేపల్లి మండల బూత్ లెవెల్ ఏజెంట్ (బి.ఎల్.ఏ.)గా,ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు బి.బి.వి.నరసింహారావుని నియమించారని,ముదినేపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో బూత్ లెవెల్ గ్రామ బి.ఎల్.ఏ.లను నియమిస్తారని,గ్రామ బి.ఎల్.ఏ.లుగా నియమంచబడిన వారు చెయ్యవలసిన కార్యక్రమాన్ని తెలియచేస్తూ, గ్రామ బి.ఎల్.ఏ. ఓటరు జాబితా పరిరక్షకుడని, భారత ఎన్నికల సంఘం (ఈ.సీ.ఐ.) నిబంధనల ప్రకారం, ఓటరు జాబితాలో పారదర్శకతను పెంచేందుకు,రాజకీయ పార్టీల భాగస్వామ్యాన్ని నిర్ధారించే కీలక వ్యక్తి బూత్ లెవల్ ఏజెంట్ (బి.ఎల్.ఏ.).నిర్వహించాలని,గ్రామ స్తాయి బి.ఎల్.ఏ.లని ముదినేపల్లి మండల బి.ఎల్.ఏ.బి.బి.వి.నరసింహారావు నియమిస్తారని,గ్రామ స్తాయి బి.ఎల్.ఏ.లు చేయవలసిన ముఖ్యమైన విధులను వివరిస్తూ, ఓటరు జాబితా పరిశీలన చేసి కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన లేదా ఊరు విడిచి వెళ్ళిన వారి పేర్ల తొలగింపు మరియు తప్పుల సవరణలు చెయ్యాలని, క్షేత్రస్థాయి పరిశీలన (వెరిఫికేషన్) ప్రభుత్వ బి.ఎల్.ఓ. (బూత్ లెవెల్ ఆఫీసర్ ) తో కలిసి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించడం,?అభ్యంతరాలను దాఖలు చేయటం, జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే, గ్రామస్తాయి బి.ఎల్.ఏ.మండల బి.ఎల్.ఏ.కి ముదినేపల్లి బి.జే.పీ.పార్టీ కార్యాలయంలో అందించటం, బి.జే.పీ.పార్టీ సీనియర్ నాయకులు కోటప్రోలు కృష్ణ,మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మిలకు తెలియచేసి,ఏం.ఎల్.ఏ.కామినేని శ్రీనివాస్ కి తెలియచేసి,ఏం.ఎల్.ఏ.ఆదేశాల ప్రకారంగా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించటం, ఈ కార్యచరణ ప్రణాళికని 30 రోజుల లక్ష్యంగా నిర్వహించాలని,అందులో భాగంగా మొదటి 3 రోజులు: గ్రామ స్తాయి బి.ఎల్.ఏ.లు ఓటరు జాబితా సమగ్ర పఠనం చెయ్యాలని, తదుపరి 15 రోజులు: ఇంటింటి సందర్శన చెయ్యాలని, మరియు ఓటర్ల ధృవీకరణ పత్రాలు పరిశీలించాలని, మిగిలిన రోజులలో అభ్యంతరాల పరిష్కారం మరియు ఫారమ్-6, 7, 8 లపై పర్యవేక్షణ చెయ్యాలని, మన ఓటు – మన హక్కు! ఓటరు జాబితాలోని సవరణ లపై గ్రామ బి.ఎల్.ఏ.లు మండల బి.ఎల్.ఓ. బి.బి.వి.నరసింహారావు కి తెలియ చేయాలని, గ్రామ బి.ఎల్.ఓ.లు విధిగా పత్రాలు ముదినే పల్లి మండల బి.జే.పీ.పార్టీ కార్యాలయం లో అప్పగించి, తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం




కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని సీఎం విమర్శించారు. గురువారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో పర్యటించిన సీఎం.. 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేదన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయని.. దారిలో పెడుతున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ప్రజల భూములపై కన్నేశారని.. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని మండిపడ్డారు. 'పట్టా పుస్తకంపై జగన్ ఫొటో వేసుకున్నారు.. ఆస్తి మీది.. ఫొటో ఆయనది' అని విమర్శించారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతిపోయిందని సీఎం అన్నారు. నూటికి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతినెలా 9న ఒక ప్రాంతంలో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని.. జులై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి కోటి 12లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని వెల్లడించారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రికార్డులు మారుస్తున్నామని చెప్పారు. రైతులకు ఇస్తున్న పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరన్నారు. కరెన్సీకి వాడే టెక్నాలజీని పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. 22ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకొస్తామన్నారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు ఆదర్శం కాకూడదని సీఎం అన్నారు. సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూమి నుంచి వచ్చే ఆదాయమే కాకుండా.. సముద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేసిందని.. ప్రతి దాని పైనా అప్పులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోయిందన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను డెవలప్ చేశానని.. ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు.



అన్నీ ఆలో చించే రాజధానికి అమరావతి పేరు పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రజా రాజధాని.. దేవతల రాజధాని.. అమరావతి' అని పేర్కొన్నారు. ఆనాడు బాబాయ్‌ని చంపి.. ఆ నేరం తనపై వేశారని సీఎం మండిపడ్డారు. అమరావతిపై జగన్ కక్షగట్టారని.. ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియోలు తీశారని, లాఠీలతో కొట్టించారని గుర్తుచేశారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచిందన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ఒక్కడే సైకో అనుకున్నామని.. వైసీపీ నేతలంతా సైకోలుగా మారారని వ్యాఖ్యానించారు. 'నీలాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదు' అని స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే విధ్వంసం చేశారని... ప్రతిపక్షంలో ఉంటే బెదిరిస్తున్నారని అన్నారు. రాష్టాన్ని నాశనం చేయాలనుకుంటే.. దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# సినిమా న్యూస్



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో కలిసి సమంత నటించిన ఫ్యామిలీ రొమాంటిక్ డ్రామా -ఖుషి-. ఈ మూవీ తరువాత వ్యక్తిగత సమస్యల కారణంగా కాస్త బ్రేక్ తీసుకున్న సమంత ప్రొడ్యూసర్‌గా, నటిగా మళ్లీ రెట్టించిన ఉత్సాహంతో సినిమాలు చేయడం మొదలు పెట్టింది. నాగచైతన్యతో విడాకుల అనంతరం కొంత మానసిక ఒత్తిడికి గురైన సమంతా ఆ తరువాత -ది ఫ్యామిలీ మ్యాన్- సిరీస్ డైరెక్టర్లలో ఒకరైన రాజ్ నిడిమోరుని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఆయన సహకారంతో నిర్మాణ సంస్థని స్థాపించి చిన్న సినిమాలకు నిర్మాతగా సమంత శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబర్ 1న దర్శకుడు రాజ్ నిడిమోరుని వివాహం చేసుకన్న సామ్ కొత్త లైఫ్‌ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే భర్త రాజ్ నిడిమోరుపై తన ప్రేమని వ్యక్తం చేసిన సమంత తాజాగా ఆసక్తికరంగా స్పందించింది. రాజ్‌తో భావోద్వేగ భద్రతను, నమ్మకాన్ని పొందానని వెల్లడించింది. అంతే కాకుండా తాజాగా మరింత ఆసక్తికరంగా స్పందించి ఆశ్చర్యపరుస్తోంది. నా జీవితంలో ఇన్ని సంఘటనలు జరిగిన తరువాత కూడా నేను ఒక మంచి మనిషిగా, ఒక ఉత్తమ నటిగా ఎదగడానికి కారణం నా భర్త రాజే- అంటూ స్పష్టం చేసింది. మేము ప్రతి పనిని కలిసే చేస్తాము. పని, వినోదం, వ్యాయామం కూడా. ఒక్క రోజు కూడా నేను అతనికి దూరంగా ఉండలేను- అంటూ ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. తన వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలకు తన జీవిత భాగస్వామి ఏ స్థాయిలో కీలక పాత్ర పోషించారో వివరిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది సమంత. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఇదిలా ఉంటే -శుభం-లో చిన్న అతిథి పాత్ర లో మెరిసిన సమంత పూర్తి స్థాయి క్యారెక్టర్‌లో సోలో మూవీతో మూడేళ్ల విరామం తరువాత ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆమె నటించిన తాజా ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా -మా ఇంటి బంగారం-. రాజ్ నిడియోరు షో రన్నర్‌గా, సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ మూవీకి నందిని రెడ్డి దర్శకురాలు. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా మే 15న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. గుల్షన్ దేవయ్య, దిగాంత్ కీలక పాత్రల్లో నటించారు.

## సమంత ఒక్కరోజు కూడా వదిలి ఉండలేదట!



# మల్టీస్టారర్ లో 'హీరో' ఎవరు? మమ్ముట్టి ఆన్సర్ ఏంటంటే?



మల్టీస్టారర్ సినిమాల్లో హీరో ఎవరన్న చర్చ ఎప్పటికీ నిలిచిపోదు. అయితే ఆ ప్రశ్నకు మాలీవుడ్ మెగాస్టార్ మమ్ముట్టి ఇచ్చిన సమాధానం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. సోషల్ మీడియాలో కూడా వైరల్ గా మారింది. "ఇలాంటి సినిమాల్లో హీరో ఎవరన్నది ముఖ్యం కాదు, కథే అసలు హీరో" అంటూ ఆయన చెప్పిన మాటలు ప్రస్తుతం చక్కర్లు కొడుతున్నాయి. రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూలో యాంకర్.. కోలీవుడ్ దిగ్గజాలు రజనీకాంత్ - కమల్ హాసన్ కాంబినేషన్ లో వస్తున్న ఖఇఇ =ఖ గ్లింప్స్ ను ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. అందులో ఇద్దరు "ఎవరు హీరో?" అని దర్శకుడిని అడిగే సన్నివేశం గురించి ప్రస్తావించి, మీరు మోహన్ లాల్ తో కలిసి నటించినప్పుడు అలాంటి సందేహం వచ్చిందా అని అడిగారు. దీనికి స్పందించిన మమ్ముట్టి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించారు. "మేమిద్దరం కలిసి నటించినప్పుడు కథే ప్రధానంగా ఉంటుంది. మేం ఆ కథలో పాత్రలు మాత్రమే. ఎవరు హీరో అన్న భావన మాకు ఉండదు" అని అన్నారు. తమ మధ్య ఎలాంటి ఇగోలు లేవని, ఒకరి సినిమాల్లో మరొకరు నటించడం చాలా సహజమని కూడా తెలిపారు. మమ్ముట్టి ఇంకా మాట్లాడుతూ, "నేను మోహన్ లాల్ సినిమాల్లో నటించాను, ఆయన కూడా నా సినిమాల్లో నటించారు. మేం ఎప్పుడూ ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ అనే ఆలోచన పెట్టుకోం. మంచి కథ ఉంటే కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉంటాం" అని చెప్పారు. ఆయన వ్యాఖ్యలు మల్టీస్టారర్ సినిమాలపై ఉన్న అభిప్రాయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు. ఇదిలా ఉంటే, సౌత్ లో అరుదైన కాంబినేషన్ గా భావిస్తున్న రజనీకాంత్ - కమల్ హాసన్ సినిమా ఇప్పటికే భారీ అంచనాలు సృష్టిస్తోంది. ఖఎఇ=ఖ అనే వర్కింగ్ టైటిల్ తో ఇటీవల విడుదలైన గ్లింప్స్ అభిమానులను ఆకట్టుకుంది. ఆ చిత్రానికి జైలర్ ఫేమ్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. గ్లింప్స్ లో రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ స్టైలిష్ గా కనిపిస్తూ పోటాపోటీగా నిలిచారు. రజనీకాంత్ కారు కీ ఇవ్వడం, కమల్ హాసన్ డ్రైవింగ్ సీట్‌లో కూర్చోవడం వంటి షాట్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. చివర్లో "ఎవరు హీరో?" అనే ప్రశ్న సినిమాపై ఆసక్తి మరింత పెంచింది.

# ఇండస్ట్రీలో హీరో పేర్లపై నటుడి హాట్ కామెంట్స్!



ఇండియాపై ఇండియన్ పొలిటీషయన్స్ చేస్తున్న కుట్రలకు చెలించిపోయిన అజయ్ సన్యాల్ దీనిపై -ధురంధర్-లో ఓ డైలాగ్ చెబుతాడు. -హిందుస్థానియోంకా సబ్‌సే బడా దుష్మన్ హిందుస్థానీ హై పాకిస్థాన్‌తో దూస్రా నంబర్‌పర్ ఆతీహై.. - భారతీయులకు అతి పెద్ద శత్రువు భారతీయుడే..పాకిస్థాన్ ఆ తరువాత స్థానంలో ఉంటుందని..ఇక్కడ కొంత మంది మాటలు వింటే అదే నిజమనిపిస్తోందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా సెలబ్రిటీలు మైక్ పట్టుకుంటే చాలు కాంట్రవర్సీలు మాట్లాడేస్తూ వైరల్ అయిపోతున్నారు. ఆ తరువాత నెటిజన్‌లు, కోర్టులు చీవాట్లు పెట్టడంతో సైలెంట్ అయిపోయి తమ పని తాము చేసుకుంటున్నారు. తాజాగా ఓ నటుడు ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలే చేసి నెట్టింట ట్రెండ్ అవుతున్నాడు తననే కమల్ కామరాజు. దర్శకుడు చంద్రశేఖర్ ఏలేటి రూపొందించిన -అనుకోకుండా ఒక రోజు- సినిమాతో నటుడిగా కెరీర్ ప్రారంభించిన కమల్ కామరాజు ..జక్కన్న - ప్రభాస్‌ల -ఛత్రపతి-, శేఖర్ కమ్ముల - సుమంత్‌ల -గోదావరి- సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నాడు. అనీష్ కురువిల్ల ఫస్ట్ టైమ్ డైరెక్ట్ చేసిన -ఆవకాయ బిర్యాని- సినిమాతో హీరోగా అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ప్రయత్నించినా ఫలించకపోవడంతో అప్పటి నుంచి హీరో ఫ్రెండ్, సపోర్టింగ్ క్యారెక్టర్లు చేస్తూ వస్తున్నాడు. రీసెంట్‌గా పవన్ కల్యాణ్ నటించిన -ఉస్తాద్ భగత్‌సింగ్- మూవీలో కమల్ అనే ఆఫీసర్ క్యారెక్టర్‌లో నటించాడు. తాజాగా ఓ పోడ్ కాస్ట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కమల్ కామరాజు మాట్లాడుతూ తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోలకి ముస్లిం పేర్లు ఎందుకు పెట్టరు దీని గురించి ఎప్పుడైనా ఆలోచించారా అంటూ కీలక వ్యాఖ్యలు చేశాడు.

# నేహా శర్మ అందాల విందు.. ఫ్యాన్స్ ఫిదా



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన 'చిరుత' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన నేహా శర్మ, తన గ్లామర్‌తో మరోసారి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో వెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. వయసు పెరుగుతున్నా కొద్దీ తన ఫిట్‌నెస్‌తో మరింత యంగ్‌గా, ఆకర్షణీయంగా కనిపిస్తూ కుర్రకారును మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ ఫోటోలతో పాటు ఆమె ఇచ్చిన క్రేజీ క్యాప్షన్ కూడా అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటూ వైరల్ అవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.. నేహా శర్మ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలలో చాలా బోల్డ్‌గా కనిపిస్తోంది. ఆమె ధరించిన వెస్ట్రన్ డ్రెస్ తన గ్లామర్‌ను మరింత ఎలివేట్ చేస్తోంది. ముఖ్యంగా తన టోన్డ్ లెగ్స్ కనిపించేలా ఆమె ఇచ్చిన స్టిల్స్ నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. ఈ ఫోటోలకు ఆమె "వైల్డ్లీ డెల్యూషనల్.. అండ్ ఐ లైక్ ఇట్ లైక్ దట్" అంటూ ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ కూడా ఇచ్చింది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే వేల సంఖ్యలో లైకులు, కామెంట్లు వచ్చి చేరాయి. ఆమె స్టైలింగ్ చూస్తుంటే ఫ్యాషన్ విషయంలో నేహాకు సాటి ఎవరూ లేరనిపిస్తోంది. తెలుగు ప్రేక్షకులకు నేహా శర్మ అంటే ఒక ప్రత్యేకమైన అభిమానం. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'చిరుత' సినిమాతో ఆమె కెరీర్ గ్రాండ్‌గా మొదలైంది. ఇక మొదటి సినిమాతోనే తన అందం మరియు అభినయంతో తెలుగు వారి మనసు గెలుచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ అక్కడ బిజీ హీరోయిన్‌గా మారిపోయింది. హిందీలో పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించినప్పటికీ, ఇప్పటికీ ఆమె తెలుగు సినిమాల్లో కనిపిస్తే చూడాలని మన ఆడియన్స్ కోరుకుంటూనే ఉంటారు. నేహా శర్మ ఇంత గ్లామరస్‌గా ఉండటానికి ప్రధాన కారణం ఆమె క్రమం తప్పకుండా చేసే వర్కవుట్స్. ఆమె ఒక కంప్లీట్ ఫిట్‌నెస్ ఫ్రీక్ అని చెప్పవచ్చు. ఇక ఆమె జిమ్‌లో కష్టపడుతున్న వీడియోలను, యోగా చేస్తున్న ఫోటోలను తరచుగా తన అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఇక సరైన ఆహారం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి వల్లే ఆమె తన బాడీని ఇంత పర్ఫెక్ట్‌గా మెయింటైన్ చేస్తోంది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma